

గుంతలపై ప్రమాద సూచికలుగా ఉంచిన కవర్లు, చెట్ల కొమ్మలు



వర్షాల వల్ల కోతకుగురై ప్రమాదకరంగా మారిన లక్ష్మీనగర్ రోడ్డు

ఆదమరిస్తే అంతే

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వివిధ చోట్ల రోడ్లు కోతకుగురై ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండల పరిధిలోని లక్ష్మీనగర్ రోడ్డుది అదే పరిస్థితి. రోడ్డు ధ్వంసమై ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతల వల్ల ప్రమాదం పొంచి ఉందని గ్రహించిన సమీప రైతులు ప్రమాద సూచికగా గుంతల్లో చెట్ల కొమ్మలు, కవర్లను ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లక్ష్మీనగర్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– మిరుదొడ్డి(దుబ్బాక)



చిటారు కొమ్మల్లో గూళ్లు

సెల్ టవర్ల నుంచి వెలువడే రేడియేషన్‌లను సవాల్ చేస్తూ గిజిగాళ్లు మనుగడ సాగిస్తున్నాయి. వర్షాలతో నిండిన చెరువుల గట్లు, పాత బావులు, వాగులు వంకల్లో ఉన్న చెట్ల కొమ్మల్లో గూళ్లు కట్టుకొని సందడి చేస్తున్నాయి.

– మిరుదొడ్డి(దుబ్బాక)

క్లుప్తంగా

మంత్రిని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



మంత్రి పొన్నంతో నర్సారెడ్డి తదితరులు

వర్గల్(గజ్వేల్): రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఆదివారం వర్గల్ మండలం గౌరారం వద్ద కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి తదితరులు ఉన్నారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు సందీప్ రెడ్డి, నాయకులు సహదేవ్‌గౌడ్, భానుప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఇంజనీర్లే దేశ నిర్మాతలు



ఇంజనీర్లను సన్మానిస్తున్న వాణి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: ఇంజనీర్లే దేశ మౌలిక సౌకర్యాల నిర్మాతలని వనిత క్లబ్ జిల్లా అధ్యక్షురాలు మర్యాల వాణి అన్నారు. ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని ఆదివారం వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బలరామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చేపూరి శ్రీనివాస్, దుబాసి అన్నయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీ, సూపరింటెండెంట్ సాయిబాబాలను ఘనంగా సన్మానించారు. దేశంలోని సాగు, తాగునీటి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణంలో ఇంజనీర్ల కృషి అమోఘం అన్నారు. కార్యక్రమంలో వాసవిక్లబ్, వనిత క్లబ్‌ల సభ్యులు వీరేశం తదితరులు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్‌లో భారతి సిమెంట్స్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీమాత ట్రేడర్స్‌లో ప్రొప్రైటర్లు బాలన్‌రావు, రమేష్, టెక్నికల్ ఇంజనీర్ ఎం.ప్రశాంత్ కేక్‌ను కట్‌చేశారు.

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్‌గా మురళీ

సిద్దిపేటరూరల్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రూరల్ మండల కన్వీనర్‌గా కోదాది మురళీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని పెద్దలింగారెడ్డిపల్లిలో మండలశాఖ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీని సామాజిక నాయకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. హాజరైన జిల్లా కన్వీనర్‌లు సత్తయ్య, శ్రీరాములు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా వర్గీకరణ పేరుతో కమిటీ వేయడం సరికాదన్నారు కార్యక్రమంలో బాలయ్య, చంద్రశేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి విశేషార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరాలయంలో ఆదివారం శ్రవణ నక్షత్ర మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో తెల్లవారుజామున స్వామివారి మూలవిరాట్టుకు విశేష పంచామృతాభిషేకం, గణపతి హోమం, సామూహిక లక్ష తులసి దళార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ వెంకటేశ్వరునికి, సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు.

నిమజ్జన ఘట్టానికి సర్వం సిద్ధం

- జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి..
- పోలీస్ రికార్డుల ప్రకారం 2,860 విగ్రహాలు
- మున్సిపాలిటీల్లో ఏర్పాట్లు పూర్తి
- చెరువుల వద్ద పక్కా ప్రణాళికలు

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): పది రోజులుగా భక్తులతో ప్రత్యేక పూజలు అందుకున్న లంబోధరుడు తన తల్లి గంగమ్మ చెంతకు చేరేందుకు సిద్ధమయ్యాడు. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలు, కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో కొలువైన వినాయక విగ్రహాలు సోమవారం, మంగళవారం గంగమ్మ ఒడికి చేరుకోనున్నాయి. అందుకు మున్సిపల్, పోలీస్, విద్యుత్, రెవెన్యూ, నీటిపారుదల, ఆర్ డబ్ల్యూఎస్, మత్స్యశాఖ, వైద్యశాఖల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాలో పోలీస్‌ల రికార్డుల ప్రకారం 2,860 వినాయక మండపాలు ఉన్నాయి. ఇవే కాకుండా మరో 300వరకు చిన్న వినాయక మండపాలు ఉంటాయని అంచనా.

పటిష్ట బందోబస్తు

గణేష్ శోభాయాత్రలో డీజేల వినియోగం, బాణాసంచా వాడకంపై నిషేధం ఉంది. భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో శోభాయాత్ర నిర్వహించుకోవాలని వివిధ శాఖల అధికారులు మండపాల నిర్వాహకులను కోరారు. సోమ, మంగళ వారాలలో నిర్వహించనున్న ఈ వినా యక నిమజ్జనాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోకి వచ్చే వాహనాలను ఉదయం 6గంటల నుండి రాత్రి 6గంటల వరకు ప్రత్యేక రూట్ల ద్వారా మాత్రమే అనుమతించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టారు.



కోమటి చెరువు వద్ద నిమజ్జనం చేస్తున్న యువకులు

చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శోభాయాత్ర రూట్‌లు, నిమజ్జన ప్రదేశాలలో సీసీ కెమేరాల ద్వారా పర్యవేక్షణ చేయనున్నారు. కోమటి చెరువు, ఎర్ర చెరువు, నర్సాపూర్ చెరువు, గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్ ఊర చెరువు, దుబ్బాక పట్టణంలోని రామసముద్రం చెరువు, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, చేర్యాల కుడి చెరువుల వద్ద వివిధ శాఖల ఆధ్వర్యంలో భారీ క్రేన్‌లు, భారీ కేడ్లు, తాగునీరు, విద్యుత్ లైట్లు, గజఈతగాళ్లు, అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిమలను మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలోనే నిమజ్జనం చేయనున్నారు.

నిమజ్జనాలకు కట్టుదిట్టమైన చర్యలు



గణపతి ప్రతిమల నిమజ్జనాలకు జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. జిల్లాలో 2,860 వినాయక మండపాలను రిజిస్టర్ చేసుకున్నారు. ఆ విగ్రహాలను సోమ, మంగళవారాలలో నిమజ్జనాలు చేయనున్నారు. అందుకోసం చెరువుల వద్ద ప్రత్యేకంగా సీసీ కెమేరాలు ఏర్పాటు చేశాం.

– అనురాధ, పోలీస్ కమిషనర్, సిద్దిపేట

చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



గణపతి నిమజ్జనాల కోసం సిద్దిపేట కోమటిచెరువు, ఎర్ర చెరువు, నర్సపూర్ చెరువల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. క్రేన్లు, బారికేడ్లు, తాగునీరు, విద్యుత్ లైట్లు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాం.

– ఆశ్రిత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట



సిద్దిపేటకమాన్: శివలింగం ఆకృతిపై దీపాలు



జగదేవ్‌పూర్(గజ్వేల్): మునిగడపలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): బీసీ హాస్టల్‌లో..

గణనాథా! కరుణించవయా..!

వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా గణనాథుడి మండపాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు స్వామి వారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పలు చోట్ల ఘనంగా నిమజ్జనాలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ దర్శించుకున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో సామాజిక సేవకుడు వెంకట్‌రెడ్డి 23రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించారు.



గజ్వేల్‌రూరల్: వినాయకుడిని దర్శించుకుంటున్న రఘునందన్‌రావు



చిన్నకోడూరు(సిద్దిపేట): బీజేపీ నేతల పూజలు



హుస్నాబాద్: పూజల్లో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



సిద్దిపేటఅర్బన్: అన్నదానం చేస్తున్న వెంకట్‌రెడ్డి

త్వరలోనే బస్సులు నడుపుతాం..

డిపో మేనేజర్ పవన్ శర్మ



పనులను పరిశీలిస్తున్న పవన్ శర్మ, సీఐ లతీఫ్

దుబ్బాకటౌన్: గజ్వేల్ నుంచి రాయపోల్ మండల పరిధిలోని సయ్యద్ నగర్, రామారం, గొల్లపల్లి, ఇందుప్రియాల్ గ్రామాల మీదుగా బస్సు సౌకర్యాన్ని త్వరలోనే పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్సుడిపో మేనేజర్ పవన్ శర్మ తెలిపారు. రాయపోల్ మండలంలోని సయ్యద్ నగర్, రామారం గ్రామాల నుంచి నిర్మాణంలో ఉన్న రోడ్డును తొగుట సీఐ లతీఫ్‌తో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. కొన్ని నెలలుగా రాయపోల్ మండలంలో కొన్ని గ్రామాల నుంచి బస్సు సౌకర్యం నిలిచిపోవడంతో రెండు రోజుల క్రితం కాలేజ్ విద్యార్థులు వడ్డేపల్లి గుర్రాల సోఫా వద్ద రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో ఎస్ఐ బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామి ఇచ్చారు. సమస్యను సీఐ లతీఫ్, డిపో మేనేజర్ దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన స్పందించి బస్సులు వెళ్లే రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్లు వర్షాల కారణంగా గుంతలుగా మారడం, రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో బస్సు సౌకర్యం ఆగిపోయిందన్నారు. రెండు రోజుల్లో రోడ్డు మరమ్మతులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పనులు పూర్తికాకగానే బస్సు సౌకర్యం కల్పిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. అలాగే రాయపోల్ మండల పరిధిలో రామారం, గొల్లపల్లి, సయ్యద్ నగర్ గ్రామాలకు వెళ్లే రోడ్డుకు రెండు వైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను గ్రామస్తుల సహకారంతో తొలగించారు. కార్యక్రమంలో రాయపోల్ ఎస్ఐ రఘుపతి, ఏడీఎం బాబు నాయక్, కాంట్రాక్టర్ రమేష్‌రావు, ఆర్టీసీ సిబ్బంది తదితరులున్నారు.

అ'పూర్వ'సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో 2009–10లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా సంవత్సరాల తర్వాత కలిసిన వారంతా ఉత్సాహంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ప్రసాద్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఉపేందర్, రాజు, రామచంద్రం, మనోహర్, భిక్షపతిని శాలువాతో సత్కరించారు.

మన సంస్కృతి, సంప్రదాయాలకు గుర్తింపు

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత



చైర్మన్ సుజాత, నర్సారెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రపంచదేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయలకు ప్రత్యేక గుర్తింపు దుక్కుతోందని, ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నవరాత్రోస్వాలు అద్భుతంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భాగంగా లక్ష పుష్పార్చన నిర్వహిచారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవాభావం, ధాతృత్వం ఆర్యవైశ్యులకే సొంతమన్నారు. జగదేవ్‌పూర్‌లో వెంకటేశ్వర ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డైరెక్టర్ హరినాథ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఎంపీ రఘునందన్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నేతలు

వార్షికోత్సవానికి రండి

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలంలోని ఎల్కల్‌లో జరగనున్న అనంత పద్మనాభ స్వామి వార్షికోత్సవానికి రావాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఎంపీ రఘునందన్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా రాజాగౌడ్ మాట్లాడుతూ..వార్షికోత్సవం సందర్భంగా సుదర్శన హోమం, కల్యాణ మహోత్సవం ఘనంగా జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రసాద్, కుమార్, బాలమల్లు, వీరేశం, జహంగీర్ తదితరులున్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కొమురవెల్లి(సిద్దిపేట): సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై అయినాపూర్ శాఖ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. గ్రామంలో ఆదివారం సీతారాం ఏచూరి ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన మండల కార్యదర్శి సత్తిరెడ్డి మాట్లాడుతూ ఏచూరి సీపీఎం జాతీయ కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యుడుగా క్రియాశీలకమైన పదవుల్లో అత్యుత్తమమైన నాయకుడిగా గుర్తింపును పొందారన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సీతారాం ఏచూరి చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రవీందర్, ఇస్తారి, సాయిలు, యాదగిరి, ఎల్లయ్య, చంద్రయ్య, ఎండీ గోరెమియ, నారాయణ, ఉప్పలయ్య, కిష్టయ్య, కిషన్, రవి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత పోలీసు అధికారుల కార్యవర్గం



రాజులు

మిరుదొడ్డి(దుబ్బాక)/సిద్దిపేటకమాన్: విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. జిల్లా అధ్యక్షుడుగా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ గుర్రప్పగారి రాజులు ఎంపిక అయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా రిటైర్డ్ డీఎస్పీ బైరి అంజయ్య, గౌరవ సలహాదారుడుగా రిటైర్డ్ ఎస్ఐ ఉప్పరి రత్నం, ఉపాధ్యక్షుడుగా మహ్మద్ నజీరొద్దీన్, శ్రీరామ్ ఆంజనేయులు, కార్యదర్శిగా పి.వీరారెడ్డి, సహాయ కార్యదర్శిగా మహ్మద్ గౌస్ పాషా, మల్లయ్య, రామారావు, కోశాధికారిగా కందుకూరి విశ్వనాథం, కార్యవర్గ సభ్యులుగా వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, మాధవరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, విశ్వనాథం తదితరులు ఎంపికయ్యారు.

ముందస్తు పరీక్షలతో లోపాలను గర్తించొచ్చు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న మమత

సిద్దిపేటఅర్బన్: తరచూ నేత్ర వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటిచూపులో ఎలాంటి లోపాలు ఉన్నా ముందస్తుగా చికిత్స తీసుకోవడం ఎంతో మేలని డాక్టర్ మమత అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ గౌడ్, మమతా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 93మందికి పరీక్షలు నిర్వహించగా 55 మందికి అద్దాలు రిఫర్ చేశారు. చుక్కల మందును ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే గ్రామంలో ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, మాజీ ఎంపీటీసీ రంగం, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, శ్రీకాంత్, సాయి, లక్ష్మి, శేఖర్, బాలరాజు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు అందజేస్తున్న మంజుల

సిద్దిపేటజోన్: స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, ఆస్పత్రులు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్స్ సూచించారు. ఆదివారం స్థానిక భారత్‌నగర్‌లో నీలకంఠ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవాభావంతో పనిచేసే వారికి తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.